# ధారణ

కవిత ఆఫీసులో సీరియస్‌గా పని చేసుకుంటూండగా ఫోన్ మోగింది. ఇంటి నుంచి కవిత తల్లి. "ఇదిగో శ్రావ్య మాట్లాడుతుందిట, నిన్నేదో అడగాలంటోంది" అని ఇంట్రడక్షన్ ఇచ్చి ఫోన్ మనవరాలి చేతికి ఇచ్చింది.

కవిత పెన్ పక్కన పెట్టి, కంప్యూటర్ మీద నుంచి దృష్టి మరల్చుకుని, సీట్‌లో వెనక్కి వాలుతూ "శ్రావ్యా! ఏంటమ్మా!, పరీక్ష బాగా రాశావా!" అంది.

"రాశానమ్మా, నెంబర్స్ ట్వంటీ వన్ నుంచి ఫిఫ్టీ దాకా రాయమన్నారు. రాసేశా" అని ఒక్క క్షణం ఆగి, "అమ్మా! వచ్చేటప్పుడు నాకు ఫ్యాన్సీ డ్రెస్ తెస్తున్నావా!" అంది శ్రావ్య.

"ఫ్యాన్సీ డ్రెస్సా!" అంది కవిత అర్థం కానట్లుగా.

"ఊ. రేపు స్కూల్‌కి ఫ్యాన్సీ డ్రెస్ వేసుకుని రావాలని చెప్పిందిగా టీచర్. నువు ఫ్యాన్సీ డ్రెస్ తీసుకురాకపోతే నేను రేపు స్కూల్‌కి ఎలా వెళ్ళాలి?" అంది శ్రావ్య అప్పటికే గొంతులోకి ఏడుపు వచ్చేస్తూండగా.

అప్పుడు గుర్తొచ్చింది కవితకి, మర్నాడు నవంబరు 14 అనీ, చిల్డ్రన్స్ డే అనీ. "కానీ ఈ ఫ్యాన్సీ డ్రెస్ ఏమిటి? ఈ సంగతి వినలేదే!" అనుకుని "ఎప్పుడు చెప్పిందమ్మా టీచర్, ఇవాళ చెప్పిందా!" అని అడిగింది.

"కాదు, నిన్నే చెప్పింది. పొద్దున నాన్నకి చెప్పాగా! నాన్న సాయంత్రం వచ్చేటప్పుడు తెస్తాలే అన్నారు" అంది శ్రావ్య.

"సరే" సాలోచనగా అంటూ కవిత ఫోన్ పెట్టేసింది.

"ఫ్యాన్సీ డ్రెస్ గురించి ఈయనతో చెప్పిందా! ఈయన అనలేదే!" అనుకుంటూ శ్రీధర్‌కి ఫోన్ చేసింది. "శ్రావ్యకి ఫ్యాన్సీ డ్రెస్ తెస్తానని చెప్పారా!" అంది.

"లేదే!" అన్నాడు శ్రీధర్.

కవితకి అర్థమయింది. పొద్దున స్కూల్ దగ్గర దింపేటప్పుడు శ్రీధర్‌తో చెప్పి వుంటుంది శ్రావ్య. కానీ అతను హడావిడిలో ఆ విషయమే వినిపించుకోలేదు. వినిపించుకున్నా మర్చిపోయాడు.

చిన్నగా నిట్టూర్చింది కవిత. శ్రీధర్‌కి విషయం వివరించి "మీరు నా ఆఫీస్ దగ్గరికి రండి కలిసి వెళ్దాం" అని చెప్పింది.

శ్రావ్య ఈ సంవత్సరమే ఎల్.కె.జి.లో చేరింది. నాలుగేళ్ళ పిల్లతో ఫ్యాన్సీ డ్రెస్ అంటే ఏం వేయించచ్చు? ఈజీగా వేసేట్లు వుండాలి కదా! శ్రీధర్ వచ్చేవరకూ ఆలోచిస్తూనే వుంది కవిత.

"ఊ చెప్పు. ఏం చేద్దాం" అన్నాడు శ్రీధర్ కవిత ఆఫీసులోనుంచి బయటికి రాగానే.

"దానికి ఫ్యాన్సీ డ్రెస్ వేయాలని వుందండీ! ఫ్యాన్సీ డ్రెస్ అంటే ఏదో కొనుక్కుని తెచ్చుకునే డ్రెస్ అనుకుంటోంది. మనం కొని తీసుకువెళ్తే, ఆ డ్రెస్ వేసుకుని రేపు స్కూల్‌కి వెళ్లాలనుకుంటోంది. దాన్ని చిన్నబుచ్చడం నాకు ఇష్టం లేదు".

కవిత మాటలకి సాలోచనగా చూశాడు శ్రీధర్. ఇద్దరూ ఒక అయిదు నిమిషాలు ఆలోచించారు.

"కృష్ణుడు చాలామంది వేయిస్తారేమో! నారదుడు అయితే బాగుంటుంది కానీ... చిన్ని వీణ కావాలి కదా!" అంది కవిత.

ఆమె ఆ మాటలు అంటూండగానే ఏదో ఫ్లాష్ వెలిగినవాడిలా మొహం పెట్టాడు శ్రీధర్.

"ఇలాంటివన్నీ రెంట్‌కి ఇస్తారు కవితా! కోటిలో అలాంటి షాపు వుంది" అన్నాడు.

"అవునా! మీకెలా తెలుసు?" అంది కవిత ఉత్సాహంగా.

"మా ఫ్రెండొకడు డ్రామా ఆర్టిస్ట్ వుండేవాడు. వాడితో వెళ్ళానొకసారి".

"అయితే ఇంకేం! వెళ్లి చూద్దాం పదండి" ప్రాబ్లం సాల్వ్ అయిపోయినందుకు సంబరపడుతూ అంది కవిత.

"ఏమో దాదాపు పదేళ్ళయింది నేనక్కడికి వెళ్లి. ఇప్పుడాషాపు అక్కడ వుందో, లేదో" స్కూటర్ స్టార్ట్ చేయబోతూ శ్రీధర్ సందేహం వెలిబుచ్చాడు.

"సరే, ముందు అక్కడ చూద్దాం. ఆ షాపు లేకపోతే ఒక గాగ్రాచోలి కొని రాధ వేషం వేయించేస్తాను. అది ఎలాగో ఒక గాగ్రా చోళీ కొనిపెట్టమని అడుగుతోంది" అంది కవిత సర్దుకుంటున్నట్లుగా.

ఇద్దరూ కోఠి చేరి... షాపు గురించి వాకబు చేసి వెళ్ళేసరికి ఆరున్నరయింది టైమ్.

మూసేసిన షట్టర్స్ వైపు చూసి కవిత నిరాశపడబోతూండగా.. "వెళ్ళి క్యూలో నిల్చో" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

అప్పుడు చూసింది కవిత. మెయిన్ షట్టర్ వేసి ఉంది. పక్కన తలుపులో నుంచి జనం లోపలికి వెళ్తున్నారు.

"ఎవరు వీళ్ళంతా!" కవిత ఆశ్చర్యంగా అడుగుతుంటే, "మనలాంటి వాళ్ళే... అందరికీ అవసరమేగా రేపు" శ్రీధర్ అనుమానం తీరుస్తున్నట్లుగా చెప్పాడు.

కవిత గబగబా వెళ్ళి లైన్లో నిల్చుంది.

ఆమె ముందు బాగా ఒడ్డూ పొడుగూ వున్న ఒక వ్యక్తి నిల్చుని వున్నాడు. ఆ ముందు మరికొంతమంది. తలుపు దగ్గర నిలుచున్న అతను ఎవరినీ లోపలికి వదలడం లేదు. కవిత నిలుచున్న వెంటనే వెనక మరో పదిమంది గబగబా వచ్చి నిలబడ్డారు.

పెరుగుతున్న క్యూతోపాటూ ఉత్కంఠా పెరిగింది. "శివాజీ డ్రెస్ వుందా! హనుమంతుడి డ్రెస్ వుందా! వేంకటేశ్వరస్వామి వుందా!" అని జనం ప్రశ్నలు వేస్తుంటే అసలు అన్ని రకాల డ్రెస్‌లు వుంటాయన్న ఊహయినా లేని కవిత విస్తుపోయి చూడసాగింది.

"డిమాండ్ వుండే డ్రెస్‌లన్నీ అయిపోయినాయమ్మా... ఏమన్నా ఇండియన్ డాన్స్‌లూ అవయితే దొరుకుతయి" అన్నాడు తలుపు దగ్గర నిలుచున్నతను.

"ఇండియన్ డ్యాన్సులంటే..."

"అంటే రాజస్థానీ డాన్స్ డ్రెస్ లాంటివి" అతను ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నట్లుగా చెప్తుంటే అతని మాట పూర్తిగా వినిపించుకోకుండా... "సరస్వతీ వుందా! సాయిబాబా వుందా!" అంటూ జనం మళ్ళీ ప్రశ్నలు మొదలుపెట్టారు.

వేరే ప్రోగ్రాం కోసం అంతకుముందు డ్రెసెస్ తీసుకువెళ్ళినవాళ్ళు వచ్చి రిటర్న్ చేస్తూంటే... క్యూలో నిల్చున్న వాళ్ళు ఆత్రంగా "అదేంటి? ఇదేంటి?" అని అడగడం మొదలు పెట్టారు.

ఎవరో క్యారట్ డ్రెస్ తెచ్చారు. మరెవరో మూలీ తెచ్చారు. క్యూలో నిల్చున్నవాళ్ళు ఇద్దరు "అవి మాకిచ్చేయండి" అని తీసుకుని వెళ్ళిపోయారు.

లోపల ఏమీ లేవని చెప్తున్నా "ఏమో... ఇంకేమన్నా మంచివి దొరుకుతాయేమో నని ఆశ చావని వాళ్ళు అలాగే క్యూలో నిలుచున్నారు.

మిలట్రీ డ్రెస్, పోలీస్ డ్రెస్ ఒకేసారి వచ్చాయి.

కవిత ముందు నిల్చున్న వ్యక్తి గబగబా సెల్‌ఫోన్‌లో ఇంటికి మాట్లాడాడు. కొడుకుని కాబోలు సంప్రదిస్తున్నాడు. "మిలట్రీ డ్రెస్, పోలీస్ డ్రెస్ రెండూ వున్నాయి... ఏది తెమ్మంటావు?" అని.

"వివేకానందుడే కావాలా! మిలట్రీ డ్రెస్ కూడా బానే వుంటుందిగా! వద్దా! సరే ట్రై చేస్తాలే!" ఆయన ఫోన్ పెట్టేసి కర్చీఫ్‌తో నుదిటి మీది చెమట తుడుచుకున్నాడు.

కవిత విస్మయంగా చూసింది. ఒక్కొక్కళ్ళూ పిల్లలకి ఇస్తూన్న ఇంపార్టెన్స్ చూస్తూంటే మతిపోయేంత ఆశ్చర్యం అనిపిస్తోంది.

ఏదో తను కాస్త భావుకత ఎక్కువగా వున్న బాపతు కాబట్టి... సంగీతంలోనూ, సాహిత్యంలోనూ కొట్టుకునే రకం కాబట్టీ కొంచెం ఓవర్‌గా శ్రావ్య ఫీలింగ్స్‌కి రియాక్ట్ అయ్యానని అనుకుంటూన్న కవితకి మొరటుగా వున్న పురుషులు సైతం పిల్లల మీద అంతే ఆసక్తి చూపడం కొంచెం విస్మయాన్నీ ఎక్కువగా ఆనందాన్నీ కలిగించింది.

టైమ్ గడిచే కొద్దీ కవిత ముందు నిలుచున్న ఆయనకి కంగారు పెరిగిపోతోంది. "మావాడు వివేకానందుడి డ్రెస్ మాత్రమే కావాలంటున్నాడండీ. వాడి మనసులో ఎలా పడిందో, ఎవరు చెప్పారో తెలీదు కానీ అదే కావాలని గొడవ. ఏం చేయాలో! దొరుకుతుందో లేదో!" జనాంతికంగా అన్నాడు.

"వివేకానందుడి డ్రెస్ వుంటుందంటావా!" అని తలుపు దగ్గర నిలుచున్న వ్యక్తిని అడిగాడు.

"ఏమో సార్, వెతుక్కోవాల" ఏ మాత్రం టెన్షన్ లేకుండా నిర్లిప్తంగా సమాధానం చెప్పాడతను.

వెతుక్కుంటే దొరుకుతుంది అన్న ఆశాభావం ఆ సమాధానంలో గోచరించి ఆయన మళ్లీ సహనంగా నిలుచున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత ఆయనా, కవితా, శ్రీధర్ మరో ఇద్దరూ లోపలికి ప్రవేశించగలిగారు.

అక్కడి దృశ్యం చూస్తూనే కవితని నిస్సత్తువ ఆవరించింది. అదో మాయా లోకం. అన్ని బట్టలూ కింద కుప్పలుగా పోసి వున్నాయి. వాటిని కలయతొక్కుతూ... ఎవరికి కావలసిన వాటికోసం వాళ్ళు గోల గోలగా వెతుక్కుంటున్నారు. నలుగురు పిల్లలూ, ఇద్దరు పెద్దలూ వాళ్ళకి సహాయం చేస్తున్నారు.

శ్రీధర్ నారదుడి డ్రెస్ కోసం వాకబు చేస్తూంటే సమాధానం కూడా సరిగా దొరకడం లేదు.

ఆయన మాత్రం ఎలాగో వివేకానందుడి డ్రెస్ సంపాదించాడు. వివేకానందుడి డ్రెస్ అంటే ఒక కాషాయం లాల్చీ... చిన్న కాషాయం పంచె... తలపాగా. లాల్చీ కొంచెం పెద్దగా వుంది. పిల్లవాడికి నాలుగేళ్ళట. కొద్దిక్షణాలు సందేహపడి చివరికి దాంతోనే సంతృప్తిపడ్డాడు. తలపాగా ఎలా కట్టాలో ఒకసారి చూపించమని అడిగి, ప్రాక్టీస్ చేసుకుని బయల్దేరాడు.

కవితకీ శ్రీధర్‌కీ మాత్రం ఏమీ నచ్చలేదు. శ్రీధర్ కుందేలు తీసుకుందామని సరదా పడ్డాడు కానీ శ్రావ్య వేసుకుంటుందో లేదో అని అనుమాన పడింది కవిత. "మొహం కూడా కవర్ చేసే టైప్ వద్దండీ. గుచ్చుకుంటోందని శ్రావ్య వేసుకోకపోతే అద్దె దండగ" అంది.

చివరికి ఓ కృష్ణుడి డ్రెస్ మిగిలిపోయి కనిపించింది. "పోన్లే. ఒక్కొక్కదానికీ వెతుక్కోకుండా అన్నీ సెట్‌గా దొరికాయి కదా! ఇదే వేసేద్దాంలే" అనుకుని మూడొందల రూపాయల డిపాజిట్ కట్టి ఆ డ్రెస్ తీసుకుని బయటకి నడిచారు.

ఇంటికి వచ్చేసరికి శక్తంతా అయిపోయినట్లనిపించింది కవితకి.

చాలామంది కృష్ణులు వస్తారేమో! ఉన్నంతలో వెరైటీగా వుంటుందని శ్రావ్యకి ఓ శ్లోకం నేర్పుదామనుకుంది కవిత. కానీ అప్పటికే శ్రావ్య దాదాపుగా నిద్రకళ్లతో వుంది. ఒక్కసారి డ్రెస్ చూసుకుని సంతోషంగా పడుకుంది.

✧ ✧ ✧

మర్నాడు పొద్దున్నే నిద్రలేవగానే శ్రావ్యతో శ్లోకం వల్లెవేయించింది కవిత. తేలిక మాటల్లో ఆ శ్లోకానికి భావం కూడా చెప్పింది. ఒక నాలుగుసార్లు చెప్పగానే శ్రావ్యకి కంఠస్థం వచ్చేసింది. పోటీ తొమ్మిది గంటలకి.

శ్రావ్యని తీసుకుని వెళ్లేసరికి పిల్లలంతా అప్పుడప్పుడే వస్తున్నారు. పార్టిసిపేట్ చేసే పిల్లలందరినీ టీచర్లు సెక్షన్‌వైజ్‌గా స్టేజికివెనుక వైపు లైన్లో నిలబెడుతున్నారు.

ముగ్గురు నెహ్రూలు, ఇద్దరు డాక్టర్లు... ఇంకా సోది చెప్పే అమ్మాయి... పూజారి... రకరకాల డ్రెస్సుల్లో పిల్లలు ముద్దుగా నిలుచుని వున్నారు.

శ్రావ్యకి మరోసారి శ్లోకం గుర్తుచేసి కవిత ఇవతలికి రాబోతూంటే ఏడుస్తూన్న వివేకానందుడు కనిపించాడు. ఆ మరుక్షణమే వాడి చెంపమీద చెళ్ళున ఓ దెబ్బపడింది.

నివ్వెరపోయి చూస్తూన్న కవితకి "మీరట్లా చేయద్దండీ, మేం చూసుకుంటాం వెళ్ళండి" అంటున్న టీచర్ గొంతు వినబడింది మొదట.

ఆ తర్వాత సంజాయిషీ, విసుగూ మిళితమైన స్వరంతో ఆ పిల్లాడి తండ్రి గొంతు వినబడింది. "ఏం చేయాలి చెప్పండి? ఎంత సేపట్నుంచి సతాయిస్తున్నాడు?"

అప్పుడు వివేకానందుడి మీదనుంచి చూపు మరల్చి అటు వైపు చూసిన కవిత ఉలిక్కిపడింది. "ఆయన ... రాత్రి చూసిన ఆయనే. క్యూలో తన ముందు నిలబడిన ఆయన".

ఆయన తనను గుర్తుపట్టాడో లేదో కవితకి అర్థం కాలేదు. ఆమె మెల్లగా ఇవతలికి వచ్చేసింది. ఆయన మాత్రం పిల్లాడికి ఏదో చెప్తూ అక్కడే నిలుచున్నాడు.

మొదట "ఎ" సెక్షన్ పిల్లలు మొదలు పెట్టారు. పూజారి చేతిలో పళ్ళెంతో వచ్చి "శుక్లాంబరధరం..." చెప్పాడు. మరో పిల్ల మ్యూజిక్‌కి తగ్గట్లూ డ్యాన్స్ చేసింది.

బి సెక్షన్ పిల్లల క్యూ మొదలవగానే ఆయన కూడా ఇవతలికి వచ్చి కవిత పక్కగా నిలబడ్డాడు.

"వినీత్ యాజ్ వివేకానంద" అని అనౌన్స్ చేయగానే టీచర్ ఆ పిల్లాడిని ఎత్తి స్టేజ్‌మీద నిలబెట్టింది. మైక్ ముందు నిల్చుని మళ్ళీ పెద్దగా ఏడుపు మొదలు పెట్టాడు వాడు. ఎక్కించినంత వేగంగా కిందకి దించేసింది టీచర్.

ఆయన ఒక్క క్షణం సర్వం కోల్పోయినవాడిలా నిలబడిపోయాడు. ఆ తర్వాత పిల్లాడ్ని విసురుగా జబ్బ పట్టి ఇవతలికి లాగుతూ "ఇంత వేస్ట్‌గాడివున్నావేమిరా!" అన్నాడు. ఆయన వెనుక ఏడుస్తూ వెళ్ళిపోతున్న వినీత్‌ని చూస్తే కవితకి జాలేసింది.

కానీ వాడి బాధేమిటో అర్థం కాలేదు. "ఏం లోపం జరిగింది వాడికి ఇపుడు? వాడు అడిగిన డ్రెస్సే తెచ్చాడు కదా వాళ్ళ నాన్న! అయినా ఎందుకు ఏడుస్తున్నాడు? ఆయన మాత్రం నిన్న అంత సహనంగా క్యూలో నిల్చుని డ్రెస్ తెచ్చినవాడు ఈ రోజు పిల్లాడ్ని ఎందుకు కొట్టినట్లు?"

కవిత ఆలోచనలు తెగకముందే శ్రావ్య స్టేజ్ మీదకి వచ్చింది. పిల్లనగ్రోవి పెదవుల కానించుకుంటూ "అయామ్ కృష్ణా" అంది. ఆ తర్వాత చెప్పసాగింది... చాలా స్పష్టంగా... అవి తన మాటలేనన్నంత ధీమాగా.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం – ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

సూది పడితే వినబడేంత నిశ్శబ్దం హాల్లో. ఆ తరువాత సముద్రపు హోరులా చప్పట్లు.

ఠీవిగా స్టేజ్ దిగుతూన్న శ్రావ్యని మురిపెంగా చూసుకుంది కవిత. "స్టేజ్ మీదకి వెళ్ళగానే తన పేరు, క్లాసూ చెప్పి ఆ తరువాత శ్లోకం చెప్పమని చెప్పింది తను. మర్చిపోయింది కాబోలు. అయామ్ కృష్ణా అనేసింది" అనుకుంటూ శ్రావ్య దగ్గరికి వెళ్లబోతూన్న కవిత శ్రావ్య ఎవరికో చెప్తూన్న సమాధానం విని కాళ్ళకి ఏదో అడ్డం పడినట్లూ ఆగిపోయింది.

ఎవరో అడుగుతున్నారు శ్రావ్యని "నీ పేరు శ్రావ్య అయితే అయామ్ కృష్ణా అని చెప్పావేంటి?" అని.

"నేనిప్పుడు కృష్ణుడ్ని కదా! అందుకే అయామ్ కృష్ణా అన్నాను. మంచి అబ్బాయిల్ని బాగా చూసుకోవడానికీ, పిచ్చబ్బాయిలకి బుద్ధిచెప్పడానికీ వచ్చా నేను".

సమాధానం చెప్పి కవిత వైపు పరుగెత్తుకు వస్తూన్న శ్రావ్య భుజం మీద తడుతూ ఆయన నవ్వాడు. "శభాష్. అచ్చం కృష్ణుడిలాగే వున్నావు" అన్నాడు.

"అచ్చం కృష్ణుడెలా వుంటాడో మీకు తెలుసా!" పక్కనేవున్న టీచర్ ఛలోక్తిగా అడిగింది.

ఆయన సమాధానం చెప్పాడు. "అచ్చం కృష్ణుడెలా వుంటాడో మనకి తెలియనక్కర లేదు. ఆ పిల్ల తానే కృష్ణుడ్నని అనుకుంది. అందుకే మనకి కొన్ని క్షణాలపాటు అదే ఫీలింగ్ కలిగింది. ఫ్యాన్సీ డ్రెస్ రక్తి కట్టడానికి దుస్తులని సరిగా ఎన్నుకోవడం, శ్రద్ధగా ధరించడం ఎంత అవసరమో ఆ పాత్రలో లీనమవడం కూడా అంతే అవసరం".

ఆ సమాధానానికి టీచర్ అంగీకారంగా తల వూపింది.

ఆయన మాటలు వింటూన్న కవితకి ఏదో క్లూ దొరికినట్లయింది. శ్రావ్య ప్రశంసలు పొందడానికి, వినీత్ ఫెయిల్ అవడానికీ కారణం తెలియడంతో పాటూ

అంత శ్రమ పడినప్పటికీ, వినీత్ తండ్రికి ఫలితం దక్కకపోవడానికి కారణం కూడా అర్థమయినట్లనిపించింది.

బాల్యానికి ప్రాముఖ్యాన్నివ్వడమే బాల్యాన్ని అర్థం చేసుకోవడమని అనుకుంటాం మనమంతా. కానీ ఆ రెంటికీ చాలా తేడా వుంది. మొదటిది కేవలం పాత్రకి తగిన డ్రెస్ తొడుక్కోవడం అయితే రెండోది ఆ పాత్రలో లీనమవడం.

పిల్లలు తమ కోరికలనీ, ఇష్టాలనీ క్షణక్షణానికీ మార్చుకుంటారు. ఒక్క క్షణం ఎంతో గాఢంగా వున్న కోరిక మరోక్షణం గుర్తు కూడా వుండకపోవచ్చు.

పెద్దవాళ్ళు అలా కాదు. ఒక కోరిక కలగగానే దాన్ని తీర్చుకోవాలని తీర్మానించుకుంటారు. అందుకోసం ఎంతో శ్రమ పడతారు. అది తీరితే ఆనందిస్తారు. తీరకపోతే నిరాశపడిపోతారు.

ఏనుగు కావాలని అడిగిన పిల్లాడు నిజంగా ఏనుగుని తెస్తే ఆనందిస్తాడనీ... మనం దాన్ని తెచ్చి వాకిట్లో కట్టేస్తే మనం ఆశించిన ఆనందం వాడి మొహంలో కనిపిస్తుందనీ అనుకుంటాం మనం. కానీ అది అన్నివేళలా నిజం కాదు.

అది ఎందుకు నిజం కాదో అర్థం కావాలంటే మనం కేవలం వాళ్ళ మాటలనీ, ఆలోచనలనీ వింటే.. తెలుసుకుంటే సరిపోదు. వాళ్ళలాగే మనమూ ఆలోచించగలగాలి. వాళ్ళే మనమైపోవాలి".

పరుగెత్తుకుంటూ వచ్చిన శ్రావ్యని దగ్గరికి తీసుకుంటూ కవిత అనుకుంది. "సమాజాన్నీ, శాస్త్రాల్నీ అర్థం చేసుకోవడం జ్ఞానానికి నిదర్శనం. కానీ పసిపిల్లలని అర్థం చేసుకోవడం అలౌకిక ఆనందానికి సోపానం.

"తిరిగిరాని బాల్యం గురించి మనమంతా బాధపడుతూంటాం. కానీ మనం ఆనందించడానికి మన బాల్యమే తిరిగి రానక్కర్లేదు. మన చుట్టూ మనకి అలవికానంత బాల్యం వుంది. దానిని మనం అర్థం చేసుకోవచ్చు. అక్కున చేర్చుకోవచ్చు. తద్వారా మన బాల్యం మనకి కలిగించిన అనుభూతికన్నా గొప్ప అనుభూతిని పొందవచ్చు".

శ్రావ్యని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటూ మరణించేంతవరకూ బాల్యానికి దగ్గరగా వుండే కిటుకు తెలుసుకున్న ఆనందంతో హాయిగా నవ్వింది కవిత.

<u>రచనాకాలం : 2003</u>